తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
బుధవారం
17 జూన్ 2026
పేజీలు - 8



# ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు

- ప్రైవేట్ అంటే త్రిశంకు స్వర్గంలా తల్లిదండ్రుల ఊహలు
- ప్రభుత్వ విద్యపై నమ్మకం కల్పించేదెప్పుడు?

*ఖానాపురం, జూన్ 16 (జనంసాక్షి): ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ప్రైవేట్, కార్పొరేట్ విద్య నేడు పేదింటి గుమ్మం వరకు చేరింది. పిల్లల భవిష్యత్తు కోసం ఏదైనా చేయాలనే తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. ఆర్థికంగా భారమవుతున్నా, అప్పులు చేయాల్సి వచ్చినా, కుటుంబ అవసరాలను కుదించుకోవాల్సి వచ్చినా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడానికే తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.మరోవైపు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, స్మార్ట్ టీవీలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు, మౌలిక వసతుల కల్పన వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు పెరగడం లేదు. ఇందుకు కారణాలపై ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు, సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది.*



ప్రస్తుతం విద్య అంటే నాణ్యత కంటే పేరు, బ్రాండ్, ఆంగ్లంలో మాట్లాడే సామర్థ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. పిల్లలు మంచి పాఠశాలలో చదవాలనే తపనలో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. బీపీఎల్ కుటుంబాలు కూడా సంవత్సరానికి లక్ష రూపాయల వరకు ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. పిల్లల భవిష్యత్తు కోసం ఏదైనా చేయాలనే భావనను కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపారంగా మలుచుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి.

### ప్రభుత్వ బడుల్లో అన్నీ ఉన్నా...

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు యూనిఫాంలు, పుస్తకాలు, నోటుబుక్స్, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల్లో నమ్మకం పూర్తిస్థాయిలో పెరగడం లేదు. కొంతమంది తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఇప్పటికీ పేదల బడులుగానే చూస్తున్నారు. తమ పిల్లలు ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారనే సామాజిక ప్రతిష్ఠ కోసం కూడా చాలామంది ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు.

### ప్రచారం ఎక్కువ..?

ప్రైవేట్ పాఠశాలలు భారీ ఎత్తున ప్రకటనలు చేస్తూ ఆకర్షణీయమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇంగ్లీష్ కమ్యూనికేషన్, ఒలింపియాడ్స్, ప్రత్యేక కోచింగ్, సీసీ కెమెరాలు, ఏసీ తరగతి గదులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇలాంటి సౌకర్యాలు అనేక చోట్ల ఉన్నప్పటికీ వాటి గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో లోపాలు కనిపిస్తున్నాయి.

### తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని చోట్ల పదుల సంఖ్యలో మాత్రమే విద్యార్థులు ఉండటంతో పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోంది.

### ఉపాధ్యాయులపై పెరుగుతున్న బాధ్యత..

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. విద్యార్థుల ఫలితాలు మెరుగుపరచడం, తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించడం, పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. బడిబాట వంటి కార్యక్రమాలు కేవలం అడ్మిషన్ల కోసమే కాకుండా ప్రభుత్వ విద్యపై నమ్మకం పెంచేలా ఉండాలి.

### ప్రభుత్వం ఏం చేయాలి?

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల బోధనతో పాటు ఆధునిక సాంకేతిక వసతులు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ గైడెన్స్ వంటి అంశాలను మరింత బలోపేతం చేయాల్సి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ బడుల్లో చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్న విద్యార్థుల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది.

### ప్రభుత్వ అధికారుల పిల్లలే ప్రైవేట్ బాట పడితే...

ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం తగ్గడానికి ప్రధాన కారణాల్లో ఒకటి ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు తమ సొంత పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాల్సిన బాధ్యత ఉన్నవారే ప్రైవేట్ విద్యను ఆశ్రయిస్తే సామాన్య ప్రజలు ప్రభుత్వ బడులను ఎలా నమ్మగలరనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించని ఉపాధ్యాయుడు, ఇతరులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎలా కోరగలడు? ఇది కేవలం వ్యక్తిగత ఎంపికగా చూడాలా? లేక ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అంతర్గతంగా ఏర్పడిన అవిశ్వాసానికి సంకేతంగా భావించాలా? అన్న దానిపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. మిగతా 8లో..

# శ్రీరాంపూర్ ఏరియాలో కవిత బాయిబాట



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వర్క్‌షాప్,ఆర్కే 7,న్యూటెక్ గనులపై హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్,అధ్యక్షుడు తిప్పారపు సారయ్యలతో కలిసి బాయిబాట కార్యక్రమం నిర్వహించారు.ఆర్కే 7గని వద్దకు వచ్చిన కవిత బాయిబాటకు సింగరేణి అనుమతి లేదని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది,పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు.గని వద్ద ఒక్క సారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొనగా హెచ్ఎంఎస్,తెలంగాణా రక్షణ సేన కార్యకర్తలు,నాయకులు సెక్యూరిటీ సిబ్బందితో వాదనకు దిగి గేటు తోసుకొని గని లోపలకి వెళ్లారు.అనంతరం కార్మికులను, మహిళా కార్మికులను కలిసి వారి సమస్యలు కవిత అడిగి తెలుసుకున్నారు.ఏరియా వర్క్‌షాప్ వద్ద కూడా కవితను అడ్డుకోవడంతో కార్యకర్తలు గేటు తోసుకొని లోపలికి వెళ్లారు.వర్క్ షాప్ కార్మికులు,మహిళా కార్మికులతో కవిత మాట్లాడి వారి పని స్థితిగతులు,యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు.గనులపై తెలంగాణా రక్షణ సేన,హెచ్ఎంఎస్ జెండాలను కవిత ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్కే 7,వర్క్‌షాప్లపై కవిత మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సంస్థ లాబాల్లో గతంలో ఇచ్చిన దాంట్లో ఎక్కువగా ఇచ్చిన దానిపై ఏటా 10 వేల రూపాయలు ఎక్కువ ఇవ్వాలని,మారుపేర్ల సవరణకు ప్రత్యేక పాలసీ తేవాలని డిమాండ్ చేశారు.అడవిలో అన్నలు లేరని అధికారులు కార్మికులను వేదిస్తున్నారన్నారని,అడవిలో అన్నలు లేరేమో కానీ అన్నలంతా మాపార్టీలోనే ఉన్నారని అన్నారు.సింగరేణిలో కార్మికుల కోసం మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. అనంతరం శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద కవిత పార్టీ జెండావిష్కరించారు.ఈ సమావేశంలో హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి,బ్రాంచి కార్యదర్శి అశోక్,మందమర్రి ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి సాజన్, నాయకులు చంద్రమోహన్,ఐదా ప్రశాంత్,రాంమోహన్చారి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌పై కమిషనర్ హనుమంతరావు సమగ్ర వివరణ

- ఆలయ ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో సమావేశం



**కాళేశ్వరం , జూన్ 16 , ( జనం సాక్షి) :** దక్షిణ కాశీగా పేరు గాంచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం నుండి మొదలుకానున్నాయి. ఈ సందర్భంగా ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కాళేశ్వరం లోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం ఈఓ కార్యాలయంలో గ్రామస్థులు, భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆలయ మాస్టర్ ప్లాన్, చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలను వెల్లడించారు. ఆలయ విస్తరణ పూర్తయిన అనంతరం ఒకేసారి సుమారు 25 వేల మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉండి సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

### రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రూ.198 కోట్ల నిధులు మంజూరు చేయగా, అష్ట తీర్థాల అభివృద్ధికి మరో రూ.60 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. పక్షి తీర్థం, వ్యాస తీర్థం, జ్ఞాన తీర్థం మిగతా 8లో..

# అమ్మ మాట అంగన్వాడి బాట

### సూపర్వైజర్లు నాగరాణి నిహారిక



మహా ముత్తారం జూన్ 16 (జనం సాక్షి) అమ్మ మాట అంగన్వాడి బాట గ్రామాలలో నిర్వహించారు. మంగళవారం మండలంలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాల నుంచి క్లస్టర్ సూపర్వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో మరియు గండి కామారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రాల నుంచి క్లస్టర్ సూపర్వైజర్ నిహారిక ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని గ్రామాల ప్రజలకు అవగాహన కోసం కార్యక్రమాన్ని గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ ప్రతి ఇంటికి తిరుగుతూ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద వారికి కావలసిన పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. చిన్నప్పటినుంచి అంగన్వాడీ కేంద్రాలకు పంపించినట్లయితే మంచి అలవాట్లతో పాటు పై చదువుల కోసం మంచి విద్యను అభ్యసించే వరకు ఆలోచన పరులు అవుతారని తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని తెలియజేశారు. గ్రామంలో ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదారం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ లక్ష్మి కిష్టయ్య, వార్డ్ మెంబర్లు పి రామా, అంగన్వాడీ టీచర్లు లత ఆయా సరోజన గండి కామారం వార్డు సభ్యుడు నామాల రాంబాబు, అంగన్వాడి టీచర్లు, ఆయలు, గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు.

## మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర పరీక్షలు

### డాక్టర్ తిరుపతి ఈ ఎన్ టి స్పెషలిస్ట్



గోవిందరావుపేట జూన్. (జనం సాక్షి). 16.06.26. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం కంటి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఈ ఎన్ టి స్పెషలిస్ట్ డాక్టర్ తిరుపతి తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తిరుపతి మీడియాతో మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే సూక్తిని గ్రహించి మండల ప్రజలందరూ ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య పరీక్షలను చూపించుకొని అవసరమైన అద్దాలు మందులు తీసుకోవచ్చని లేక ఆపరేషన్ అవసరమైతే పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తిరుపతి సూచించారు.

## నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం : తౌటం లక్ష్మి



చిట్యాల, జూన్ 16( జనం సాక్షి): మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి -అంతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొడపాక రఘుపతి, ప్రధానోపాధ్యాయులు శ్రీరాముల రఘుపతి,ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ , 4వ వార్డ్ సభ్యులు తౌటం నవీన్ ,ఉపాధ్యాయులుబుర్రసదయ్య,శ్రీనివాస్,కల్పన,విజయలక్ష్మి,రాజమౌళి, రాంనారాయణ,శంకర్,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా

### ఎస్ ఐ. ఎస్.కె. తాజుద్దీన్ పసర పోలీస్ స్టేషన్



గోవిందరావుపేట. జూన్.( జనం సాక్షి). 16.06.26. మండల నిరుద్యోగ యువతీ యువకులు బుధవారం ఇంచర్ల ఫంక్షన్ హాల్ లో పోలీసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబు మేళాను సద్వినియోగం చేసుకోవాలని పసర ఎస్ఐఎస్కె తాజుద్దీన్ అన్నారు. మంగళవారం మీడియాతో తాజుద్దీన్ మాట్లాడుతూ బుధవారం ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు పసర నుండి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కూడా కల్పించామని అన్నారు. అభ్యర్థులు మీ మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు రెండు జిరాక్స్ సెట్స్ కలిపి వెంట తెచ్చుకోగలరని ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగయువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేజీబీవీలో టీచర్, నర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



చిట్యాల, జూన్ 16( జనం సాక్షి ): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బోధించుటకు టీచర్స్ కావాలని స్పెషల్ ఆఫీసర్ సుమలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలో తెలుగు ఒక్క పోస్ట్, ఇంటర్లో ఎంపీహెచ్ డబ్ల్యు విద్యార్థులకు బోధించుటకు, నర్సింగ్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నవి. ఈ పోస్టులు తాత్కాలిక పద్ధతిలో నియామకం జరుగుతుందని, అర్హత గల మహిళ అభ్యర్థులు సంబంధిత పత్రాలతో చిట్యాలలోని కేజీబీవీలో ఈ నెల 17, 18 తేదీల్లో సా.4.00 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలు నివృత్తి చేసుకోవడానికి ఫోన్ 9398415063 ను సంప్రదించగలరు.

## సర్పంచ్‌ల సంఘం సోషల్ మీడియా ఇంచార్జిగా ఆడే పంచిబాయి దిలీప్ బాధ్యతలు



సారంగాపూర్,జూన్15(జనం సాక్షి) ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం తన గళాన్ని బలంగా వినిపిస్తూ, సోషల్ మీడియా వేదికగా ప్రజల స్వరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండే నాయకత్వ లక్షణాలను గుర్తించి ఆడే పంచిబాయి దిలీప్ ని సారంగాపూర్ మండల సర్పంచ్‌ల సంఘం సోషల్ మీడియా ఇంచార్జిగా బాధ్యతలు అప్పజెప్పారు.సర్పంచ్‌ల సమస్యలు, గ్రామాల అభివృద్ధి అంశాలు, ప్రజా ప్రయోజన కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ సంఘం తరపున మరింత సమర్థవంతంగా సేవలందిస్తానని తెలిపారు.

## ధర్మారంలో నూతన వాటర్ ట్యాంక్ ఏర్పాటుకు శంకుస్థాపన

### భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు - సర్పంచ్ బుర్క ముత్యం



లక్ష్మణ చందా, జూన్ 16 (జనం సాక్షి) మండలంలోని ధర్మారం గ్రామంలో ముత్యాల పోచమ్మ ఆలయానికి వస్తున్న భక్తులకు తాగునీటి సమస్య ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ నిధుల ద్వారా వాటర్ ట్యాంక్ ను మంజూరు చేయించుకోవడం జరిగింది. భక్తులకు తాగునీరు శాశ్వతంగా పరిష్కరించేందుకు నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బుర్క ముత్యం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న స్థానిక భక్తుల విజ్ఞప్తి మేరకు ఈ నూతన వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడం ద్వారా భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు నిరంతరాయంగా అందనుంది. ప్రజలకు ఈ వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని,ఈ నూతన ఏర్పాటుతో తమ ఆలయ ప్రాంగణానికి తాగునీటి కష్టాలు తీరనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గజ్జల ఉదయశ్రీ, పంచాయతీ కార్యదర్శి మేఘనా రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మహాగాం ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



భైంసా, జూన్16,(జనంసాక్షి) భైంసా మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపేంద్ర జోషి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. కృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, విద్యార్థులందరూ చక్కగా చదువుకొని విద్యాదేవత సరస్వతీ దేవి కటాక్షాలు పొందాలని ఆశీర్వదించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్. కనకరాజు హాజరై విద్య ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, రాగిణి, అభిషేక్, శ్రీలతతో పాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచాలి

### మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ



**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని జల్లి కాలనీ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులకు మెను ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన విద్యా బోధనను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాచారి, ఉపాధ్యాయులు మాధురి, సరోజ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల కార్యవర్గం ఎన్నిక



**సారంగాపూర్,జూన్14(జనం సాక్షి)** సారంగాపూర్ మండల సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలంలోని సర్పంచ్‌ల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన కార్యవర్గంలో మంతెన గంగారెడ్డి అధ్యక్షులుగా, కునేరు భూమన్న గౌరవ అధ్యక్షులుగా, కరిపే రవలి విలాస్ ప్రధాన కార్యదర్శిగా, జాదవ్ దిలీప్ ఉపాధ్యక్షులుగా, ఆడే పంచి బాయి దిలీప్ మీడియా ఇంచార్జ్‌గా, రాథోడ్ గవస్కర్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులు మంతెన గంగారెడ్డి మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామాల సమగ్రాభివృద్ధికి పాటుపడతామని అన్నారు. గౌరవ అధ్యక్షులు కునేరు భూమన్న సర్పంచ్‌లందరూ ఐక్యంగా ఉండి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

### తెలంగాణ ఉద్యమకారుల

## మహా గర్జన సభను జయప్రదం చేయండి



**తాండూర్, జూన్ 16(జనం సాక్షి)** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద గురువారం నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల మహా గర్జన సభను విజయవంతం చేయాలని తాండూర్ మండల అధ్యక్షులు నిరంజన్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దిబోయిన అర్జున్ లు తెలిపారు . ఈ సభ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని, తాండూరు మండలం నుంచి అధిక సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొని సభను జయప్రదం చేయాలని వారు కోరారు.

# హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**హనుమకొండ ప్రతినిధి జూన్ 16 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య...

### పిఆర్టియు వరంగల్ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి



**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని పిఆర్టియు వరంగల్ జిల్లా అధ్యక్షులు, చెన్నారావుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదునూరి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను అందించడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇళ్ల సూరయ్య, పూదోట అనిల్ కుమార్, కన్నెధార అనిల్ చౌదరి, మర్రి రాజు, మంజుల రాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**చిట్యాల, జూన్ 16( జనం సాక్షి):** చిట్యాల మండలంలో కొత్తగా మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో బోధనను నిర్వహించుటకు ఖాళీగా ఉన్న 4-ఇన్స్ ట్రక్టర్, 4-ఆయా పోస్టులకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంనకు 10 నెలల తాత్కాలిక ప్రాతిపాదికన ఎంపీపీఎస్ చిట్యాల, ఎంపీపీఎస్ భీమ్మనగర్,ఎంపీపీఎస్ జూకల్, ఎంపీపీఎస్ చల్లగరిగ, పాఠశాలలో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు భర్తీకి అర్హత గల అభ్యర్థులు ఈనెల 19, సా. 4 గంటల వరకు మండల కేంద్రంలోని ఎంఈ ఓ కార్యాలయంలో దరఖాస్తు ఫారంతో పాటు స్థానికత, విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్, పాస్ ఫోటోను జతపరచి అందజేయాలని పేర్కొన్నారు.ఇన్స్ట్రక్టర్ కు నెలకు రూ.8000 గౌరవ వేతనం అందిస్తారు. ఈ పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి, ప్రీ ప్రైమరీ డిప్లమా లేదా ప్రీ ప్రైమరీ ట్రెనింగ్ చేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆయా పోస్టుకు నెలకు రూ.6000 గౌరవవేతనం అందిస్తారు. ఈ పోస్టుకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన మార్కుల జాబితా పత్రమును జత చేయాలి. పై పోస్టులకు 18 సం. నుండి 44 సం.ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులు. స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉండనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

### ఇప్పగూడెం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాసం



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 16 ( జనం సాక్షి ) :** బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పిం చాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురా లు రేణుకా దేవి అన్నారు.మండలంలోని ఇప్పగూ డెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రేణుకాదేవి అధ్యక్షతన అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల తో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాల ని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్ లు, ఉచిత యూని ఫాం లు, అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపా యాలు ఉన్నాయని తెలిపారు.ప్రైవేటు పాఠశాల లా మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు,పాటలు వంటి మొదలై న సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించ బడతాయని, తల్లి దండ్రులు ప్రతినెల విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలందరూ సమిష్టిగా కృషిచేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయురాలు రేణుకాదేవి,ఉపాధ్యాయులు చైతన్య, శరత్, రజియా, మాలతి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు



**కడెం:జూన్ 16(జనం సాక్షి)** నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా కడెం మండల కేంద్రంలో పార్టీ నాయకుల, కార్యకర్తల ఆధ్వర్యంలో జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రోజున కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కడం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు గంగన్న ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంతో పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు రక్తదానం చేశారు. తదుపరి పలువురికి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు పలువురు మాట్లాడుతూ... ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే ప్రజానాయకుడని ఆయన సేవలను కొనియాడారు. ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తున్న గొప్ప నాయకుడని నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు పొంది ఇలాంటి జన్మదినోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# భోజేర్వు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** మండలంలోని భోజేర్వు ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా ఒకటవ తరగతిలో ప్రవేశం పొందిన నలుగురు విద్యార్థుల చేత ఉపాధ్యాయ బృందం సామూహిక అక్షరాభ్యాసాన్ని చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు చాలా బాగున్నాయని, విద్యార్థులందరికీ నాణ్యమైన ఒత్తిడి లేని విద్య అందుతుందని అన్నారు. అందరూ కూడా పాఠశాలలో ఉన్నటువంటి అవకాశాలను వినియోగించుకొని తమ పిల్లలను డబ్బులు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలలోకి పంపించకుండా ఉచితంగా విద్యా బోధనను అందించే ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ వెంకటలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ గ్రామంలోని తల్లిదండ్రులు అందరు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థిని విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పరమేశ్వర్, వెంకటేశ్వర్లు, విజేందర్ రావు, శ్వేతాశ్రీ , రాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొడవటూర్ గ్రామపంచాయతీ అవినీతి ఆరోపణలపై విచారణ



**బచ్చన్నపేట, జూన్ 16 ( జనం సాక్షి):** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూర్ గ్రామపంచాయతీలో 2012 నుంచి 2021 వరకు అవినీతి ఆరోపణలు ఉన్న అక్రమాలు, నకిలీ బిల్లుల వ్యవహారంపై జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది. గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, గత ఐదేళ్ల కాలంలో విచారణ నిర్వహించిన కొంతమంది అధికారులు హైకోర్టు, లోకాయుక్తకు తప్పుడు నివేదికలు సమర్పించారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆడిట్ అధికారి దేవేందర్, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వీరస్వామి సమక్షంలో మంగళవారం గ్రామపంచాయతీ రికార్డులు, బిల్లులు, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలపై విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా సంబంధిత పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, పనుల అమలుకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిసింది. గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 16 ( జనం సాక్షి ) : స్టేషన్ఘన్పూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రొయ్యల సంపత్ ముదిరాజ్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు,యూత్ సభ్యులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సంపత్ తో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయ కులు మరబోయిన దశరథ్, చెవుల రాకేష్,పులిగి ల్ల రవీందర్, బాబు,రవి, మరబోయిన యకరాజు, రంగు రమేష్,బూరు శేఖర్ గౌడ్,ఒంటెల రాజిరెడ్డి, ముక్కెర సంతోష్, రాజ్ కుమార్, శేఖర్, రాకేష్, మంద రాజేష్ రెడ్డి,మరబోయిన రాజేష్, యాకరాజ్, ప్రశాంత్, రవితేజ, వినోద్ పాల్గొన్నారు..

### ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు

# గ్రామ పాలకవర్గాలు తోడ్పడాలి

- నడికుడలో గ్రామ పాలకవర్గానికి శిక్షణ తరగతులు
- శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సీఈవో శేషాద్రి



**నడి కూడ జూన్ 16 (జనం సాక్షి) :** నడికూడ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు రెండవ రోజు వార్డు సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ సీఈవో శేషాద్రి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు అని తెలుపుతూ,మీరు ఎన్నికై 6 నెలలు గడుస్తుంది రాబోయే 4సంవత్సరాల 6 నెలల సమయంలో మీరు ఏ విధంగా ఉండాలి గ్రామ పంచాయతీలలో ఎన్ని రకాల నిధులు ఉంటాయి అని ఏ విధంగా ఖర్చు చేయాలి మీ యొక్క విధులు,బాధ్యతలు ఖచ్చితంగా తెలుసుకోవాలి అని తెలియజేయడం జరిగిందిమీ యొక్క గ్రామాలను ఆదర్శ గ్రామాలు తీర్చిదిద్దుటకు పాటుపడాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ ఎంపీ ఓ మార్గవి రెడ్డి, ట్రైనర్స్ లావుడ్య సాంబశివరావు, వలుస తిరుపతి,వేల్పుల సంతోష్,సాయబోయిన కిరణ్,వివిధ గ్రామాల వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'అమ్మ మాట -- అంగన్వాడి బాట' కార్యక్రమం



**చిట్యాల, జూన్ 16:** మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌లో సోమవారం 'అమ్మ మాట -- అంగన్వాడి బాట' కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ రజిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ కొడారి ఓదెలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అంగన్వాడీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మూడు సంవత్సరాలు దాటిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి చింతల లక్ష్మీ-సదానందం, వార్డు సభ్యురాలు జెట్టి రజిత, గ్రామ మహిళలు, తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### రెండు అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత- ఎస్సై శ్రీకాంత్



**బచ్చన్నపేట జూన్ 16 ( జనం సాక్షి):** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బచ్చన్నపేట ఎస్సై ఏ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కొలనుపాక శివారు వాగు నుండి బొందుగుల గ్రామానికి అక్రమంగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, వాటికి ఎస్కార్ట్‌గా వచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్‌సైకిల్‌ను నారాయణపురం గ్రామంలో స్వాధీనం చేసుకున్నామని ఈ ఘటనకు సంబంధించి కొలనుపాక గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలు రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు సమాచారం తెలియజేయవలసిందిగా మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జులై 5న రామేశ్వరం ప్రత్యేక బస్సు : డి.ఎం.పండరి



**నిర్మల్ టౌన్,జూన్16(,జనంసాక్షి)** ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి జులై 5న రామేశ్వరం తీర్థ యాత్ర కు ప్రత్యేక సూపర్ లగ్జరి బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. ఇదివరకే జూన్ 5వ తేదీ రోజు రామేశ్వరం వెళ్లివచ్చింది.ప్రయాణికుల కోరిక మేరకు ఈ బస్సు పెట్టవలసి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ బస్సు 5 వ తేదీ మ!! ఒంటి గంటకు నిర్మల్ నుండి బయలుదేరి కానిపాకం,అరుణాచలం, శ్రీరంగం, పలని, మధురై, రామేశ్వరం ధనుష్ కోడి, కంచి పురము బంగారు బల్లి వెండి బల్లి, శ్రీ కాళహస్తి చూయించుకొని తిరిగి జులై 11 వ తేదీ నిర్మల్ చేరుకుంటుందని డిపోమేనేజర్ తెలిపారు. 7 రోజుల ప్రయాణం ఛార్జి 8000/- రూ!! లు ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి కలవారు నిర్మల్ బస్టాండ్ లో గాని మీ యొక్క ఫోన్ లో గాని ముందుగా బుక్ చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు. 9959226003, లేదా 9440018549లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కార్పెట్‌ల పంపిణీ




**లక్ష్మణ చందా, జూన్ 16(జనం సాక్షి)** మండలంలోని పొట్టపెల్లి (కె) గ్రామంలో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత కార్పెట్ లు పంపిణీ చేయడం జరిగింది. 50 వేయిల విలువ కలిగిన కార్పేట్ 50 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. వరల్డ్ విజన్ సంస్థ పేద పిల్లల కు ఉచిత విద్య ఆరోగ్యంగా ఉండడానికి పౌష్టిక ఆహారం మా వంతు సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి ముఖ్య అతిథి గా సర్పంచ్ చింతకింది ముకేష్ మాట్లాడుతు పేద పిల్లల కు సహాయం చేయడం చాలా అభినందనీయమని, వరల్డ్ విజన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ,పంచాయతీ కార్యదర్శి ప్రియాంక రెడ్డి, ఉప సర్పంచ్ పోతుగంటి రవీందర్,గ్రామ విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లీతండ్రులు పాల్గొన్నారు.

## అక్రమ మొరం తవ్వకాలపై విచారణ



**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి)** పట్టణ పరిసరాలలో అక్రమంగా చేపట్టిన మొరం తవ్వకాలపై విచారణ ఆరంభమైంది. మంగళవారం మైనింగ్ అధికారులు సి ఐ రవీందర్, ఆర్ ఐ ఆనంద్ లు రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సమన్వయంతో జాయింట్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలను వెల్లడించారు. ఉన్నతాధికారుల లిఖితపూర్వక ఆదేశాల మేరకు ఈ సర్వే చేపడుతున్నామన్నారు. సర్వే ఆధారంగా విచారణ పూర్తి చేసి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరిగాయా, ప్రైవేట్ భూమిలో తవ్వకాలు జరిగాయా అనేది తేల్చాల్సి ఉందని ముమ్మాటికి మొరం తవ్వకాలు మాత్రం అక్రమమేనని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. వారి వెంట తహసిల్దార్ సుజాత రెడ్డి, తదితరులు ఉన్నారు.

### ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని శంకరం తండా గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఇదే శంకరం తండా గ్రామానికి చెందిన బానోతు స్వామి (30)కి గత ఎనిమిది సంవత్సరాల క్రితం సోనీ అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి ఆరు సంవత్సరాల కూతురు ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా స్వామి మద్యానికి బానిస అయ్యాడు. తన భార్య సోని, తన తండ్రి నంద ఎన్నిసార్లు చెప్పినా మద్యం తాగడం మానుకోలేక ఈనెల 14వ తేదీన రాత్రి మద్యం మత్తులో తన వ్యవసాయ భావి వద్ద ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. 15వ తేదీన రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి బానోత్ నంద మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు రైతులు అనవసర కొనుగోలు చేయవద్దు

### జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో వాసకాలం పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియా కొనాలని సూచించారు. వదంతులు నమ్మి ఎక్కువగా కొనుగోలు చేయవద్దని, ఎక్కువ యూరియా నిల్వ చేసుకోవడం వల్ల మిగతా రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 5761 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదు మేరకే ఎరువులు వాడాలని సూచించారు. విక్రయ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలు, బిల్లింగ్ ప్రక్రియలు పరిశీలించడం జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని డీలర్లను ఆదేశించారు. డీలర్లు ఎరువుల అక్రమ నిల్వలు చేయడం, అధిక ధరలకు విక్రయాలు చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఫర్టిలైజర్ మొబైల్ బుకింగ్ యాప్‌లో బుకింగ్ సమయంలో సమస్య వచ్చినా, విత్తనాలు, పురుగు మందులు కొనుగోళ్లలో సందేహాలు ఉన్నా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్ 8977745519 కు సంప్రదించాలనికోరారు.ఈసదవకాశాన్నిరైతులువినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలియజేశారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించాలి : సీఎండి వరుణ్ రెడ్డి



**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి)** విద్యుత్ సరఫరాలో అంతరాయాలను ముందస్తు ప్రణాళికలతో నివారించే మార్గాలను సుగమం చేసుకోవాలని విద్యుత్ శాఖ సీఎండి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేక రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు దిశా నిర్దేశం చేశారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయం చేకూరకుండా ముందస్తు ప్రణాళికలు చేయాలని అన్నారు. నాణ్యమైన విద్యుత్ క్షేత్రస్థాయిలో అందేలా చూడాలని అన్నారు. ప్రధానంగా రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, ట్రాన్స్ఫార్మర్లకు సంబంధించి మరమ్మత్తులకు సరిపడా పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్ ను పూర్తి చేయడంతో పాటు కొత్తగా ఏర్పాటు చేయనున్న సబ్ స్టేషన్ లపై పూర్తి నివేదికను సమర్పించాలని సూచించారు. మారుమూల గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయానికి అటవీశాఖ అనుమతులు అడ్డుపడుతున్నాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అటవీశాఖ అనుమతులు వచ్చిన వెంటనే మారుమూల అటవీ ప్రాంతాలలోని గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరాను అందిస్తామని ఈ సందర్భంగా వరుణ్ రెడ్డి అన్నారు. మండలంలో ఏర్పాటు చేయనున్న నూతన విద్యుత్ లైన్ల పై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి ముందుకు పోవాలని అన్నారు. ఆయన వెంట ఎస్ సి సుభాష్, డీఈ నాగరాజు, ఏ డి ఈ శ్రీనివాస్, ఏ ఈ రాంసింగ్, తదితరులు ఉన్నారు.

## సేంద్రీయ పద్ధతి ద్వారా పండించిన కూరగాయలతో ఆరోగ్యశీ పదిలం

### ఉచిత కూరగాయలవిత్తన పంపిణీలో జంపాల మురళి



**జనం సాక్షి ఎల్కతుర్తి** మానవ శరీరానికి సేంద్రియ కూరగాయలు ఎంతో తోడ్పాటు చేసి శరీరములో ఉండే గ్రంధులను కాయకూరలు ఎంతో తోడ్పాటు చేసి సమృద్ధిగా ఉంచుతుందని జంపాల మురళి అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలు సాగు చేసి వాడాలని ప్రభుత్వం ద్వారా నిపుణులు వైద్యులు ఏచ్చారికలు జారీ చేసిన రైతులు అత్యధికంగా కాయకూరలకు యూరియా ఫెస్ట్ సైడ్ వాడడం వలన రైతులు. ముసలి తనం ఏర్పడి ఇబ్బందులకు గురై అవుతున్నట్లు వారన్నారు వాటిలో ముఖ్యంగానోర చిక్కుడు.నేతి బీరకాయ.చిక్కుడు.మంచిచెన్నంగిభూడమాకాయ.దోస.అనుమూముల ు..బచ్చలి.గుమ్మడి.బూడిద గుమ్మడి. సోయా సిక్కులు ..ఆకుకూరల్లో...పాల కూర. బచ్చలి కూర తోటకూర గోంగూర పుదినా కొత్తిమిర కరివేపాకు ఇలా చెప్పుకుంటు పోతే ఆకు కూరల్లో ఉండే మెరుగైన పోషకాలు లభించును ..గింజే జాతికి చెందిన వీ చిక్కుళ్ళు బీర దొండ కాకరకాయ చిక్కుడు దేశీయ చిక్కుడు లాంటివి ఉన్నప్పటికీ మానవ షెరర భాగాలను మేరుగ ఉంచడం కోసం తోడ్పాటు చేస్తాయి మనదగ్గరవిపరితంగా దొరికే .బచ్చలీ కూర.రక్త పోటు నివారించి రక్తాన్ని వృద్ధి చెస్తూ రోగనిరోధక శక్తిని పెంపొందించే గుణాలు కూరల్లో మెండుగా ఉంటుంది నేతి బీరకాయ.సుగర్ బీపీనీ నివారించే విధంగా తోడ్పాటు చేస్తాయి..సొరకాయ చెన్నెంగ గుండెను పదిలంగా ఉంచి జబ్బులు రాకుండా మెరుగు పడే ప్రత్యేకంగా దోహదం చేస్తుంది రైతులు పొలాల్లో పంటలు వేసే ముందు ఫెస్ట్ సైడ్‌కు దూరంగా ఉండి సేంద్రియ పద్ధతినీ ఉపయోగించాలని అన్నారు...

## బాంబులగడ్డలో గంజాయి పట్టివేత ఐదుగురు నిందితుల అరెస్ట్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు కొరడా ఝుళిపించారు. బాంబులగడ్డ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులతో పాటు సరఫరా చేస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాలతో సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బాంబులగడ్డ వద్ద గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహర్షిలను అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో వెల్లడైన సమాచారంతో ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రొయ్యూరు గ్రామానికి చెందిన జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

### సర్పంచ్ బుర్సా పోచయ్య అభివృద్ధి పరిపాలనకు

# రాజంపేట మైనార్టీ సోదరుల ఘన సన్మానం

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి ):** రాజంపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ బుర్సా పోచయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, క్లీనింగ్ పనులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయి అని,గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ సేవలను అభినందిస్తూ రాజంపేట మైనార్టీ సోదరులు ఘనంగా సన్మానించారు. అలాగే మైనార్టీలకు సంబంధించిన హుద్ద మజీద్ ఖబ్రస్తాన్‌లో ఉన్న చెట్లు, పొదలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఖబ్రస్తాన్‌కు రక్షణ కల్పించేందుకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని మైనార్టీ సోదరులు సర్పంచ్ ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ పరిపాలనను మైనార్టీ సోదరులు ప్రశంసించారు. ఈ




కార్యక్రమంలో హుడా మజీద్, సర్దార్ ముబీన్, అబ్దుల్లా,నాసర్, అబ్బు, ముబాషిర్, సలీం, రియాజ్ తదితర మైనార్టీ సభ్యులు పాల్గొని సర్పంచ్ ని శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తున్న సర్పంచ్ బుర్సా పోచయ్య గారి నాయకత్వంలో రాజంపేట గ్రామపంచాయతీ మరింత అభివృద్ధి చెందాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి)** ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని సీఎం రావు ఫంక్షన్ ప్లాజాలో ఏఎంసి వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక జెసిబి ని ఏర్పాటు చేసి గజమాలను ప్రత్యేక వాహనంలో వచ్చిన ఎమ్మెల్యే మెడలో వేసి పలువురిని అబ్బురపరిచారు. బానసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పార్టీ శ్రేణుల కేరింతల మధ్య వెన్న బొజ్జు పటేల్ కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తనపై ఇంత ఆప్యాయత చూపుతున్న పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే నా చివరి శ్వాస వదిలేవరకు మీ వెన్నంటే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# నృసింహుడిని దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు

### ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన ఈఓ వీరస్వామి,అర్చకులు

**మంగపేట, జూన్ 16( జనంసాక్షి)** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహ స్వామి వారిని మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దార్మిక అడ్వైజర్ గోవింద హరి తో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కమిషనర్ హనుమంతరావు, దార్మిక అడ్వైజర్ గోవింద హరి లకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. వీరస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి వారి గర్భాలయంలో ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కమిషనర్ దంపతులకు వారికి స్వామి వారి దివ్య క్షేత్ర విశిష్టతను, స్వయంభూ నరసింహుని ప్రాముఖ్యతను, స్వామి వారి విగ్రహం నుండి నిరంతరం స్రవించే చెమట (జలధార) ప్రత్యేకతలను వివరించారు. పూజల అనంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనం చేసి, శేషవస్త్రాలు, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కమిషనర్ హనుమంతరావు ఆలయ పరిసరాలను పరిశీలించారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే పుష్కరాల నాటికి భక్తుల రద్దీ విపరీతంగా పెరుగుతుంది. అందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, ఘాట్ల నిర్మాణం, రవాణా



సౌకర్యాలు, తాగునీరు మరియు క్యూలైన్ల నిర్వహణపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి. హనుమంతరావు, దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడుతూ, భక్తులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన నివేదికలను త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించాలని ఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆరనిర్వహణాధికారి ఎం. వీరాస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ యర్రంగారి సురేష్, ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ కారంపూడి పవనాకుమారాచార్యులు ఏడునూతుల ఈశ్వరాచంద్ రామానుజన్ శర్మ ముక్కామల వెంకటనారాయణ శర్మ అనిపెద్ది రాజీవ్ నాగశర్మ, ఇతర విభాగాల అధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్‌లో అంతరాయాలు కలగకుండా చూసుకోవాలని

# అధికారులను ఆదేశించిన జవీణ వరుణ్ రెడ్డి



**కడెం:జూన్ 16 (జనం సాక్షి)** నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జవీణ కర్నాటి వరుణ్ రెడ్డి గురువారం రోజున సందర్శించి పరిశీలించారు. వర్షాకాలంలో తలెత్తే విద్యుత్ సమస్యలను ముందస్తుగా నివారించేందుకు చేపడుతున్న చర్యలను ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్లకు ఇన్సులేషన్ కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని, అలాగే పెంబి--కడెం విద్యుత్ లైన్ల బైఫర్కేషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్ వ్యవస్థలో అంతరాయాలను తగ్గించి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జవీణ వరుణ్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# చాకలి వృత్తి దారులను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలి

### చాకలి ఎస్సి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి

**గూడూరు,జూన్16(జనంసాక్షి):** చాకలి వృత్తి దారులను ఆ సంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని చాకలి ఎస్సి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తాటికొండ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం గూడూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చాకలి ఎస్సీ సాధన సమితి 9వ వార్షికోత్సవ మహాసభ చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి చాకలి హాజరై మాట్లాడుతూ చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని,2016లో అసెంబ్లీ సమావేశాల్లో నేటి ముఖ్యమంత్రి ప్రతిపక్ష



హోదాలో చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ,నేడు అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని అన్నారు.చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, చాకలి కులస్తులకు ఉచిత కరెంటు పథకం కొనసాగిస్తూ పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.చాకలి వృత్తిదారులు,దోబీ పోస్టులు దోబిళ్ళకి కేటాయించాలని, కాంట్రాక్టును దోబిళ్ళకే ఇవ్వాలని,చాకలి వృత్తిదారులను అసంఘటిత రంగ కార్మికుల గుర్తించి, గుర్తింపు కార్డులు అందజేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా కార్యదర్శి ఏదునూరి వెంకన్న,మండల శాఖ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య,మడిపెద్ది శ్రీనివాస్,రాసమల్ల రాములు, రాసమల్ల వెంకన్న, తంగళ్ళపల్లి సునీల్,సురేష్,మేడ బుచ్చి రాములు,సిరికొండ సాయిలు,రాసమల్ల యాదగిరి,మడిపెద్ది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానంలో పాల్గొన్న సతీష్ రెడ్డి



**కడెం:జూన్ 16 (జనం సాక్షి)** ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినశీ సందర్భంగా కడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరం కార్యక్రమం లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పొద్దుటూరి సతీష్ రెడ్డి హాజరై రక్తదానం చేశారు. ఆయనతోపాటు మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు గంగన్న మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్ ౦ఎ సెల్ జిల్లా అధ్యక్షులు కట్ట శ్యామ్ సుందర్ నాయకులు మల్లేష్ యాదవ్ డీసీసీ కార్యదర్శి ఊరే జలజ కమలాకర్ రెంకల శ్రీనివాస్ సంపత్ రెడ్డి రాజు శేఖర్ తదితరులు ఉన్నారు.

## రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉచ్చులు పెడితే
# అటవీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తాం

### గూడూరు ఎఫ్ఆర్ఓ ప్రసాద్ రావు



**గూడూరు,జూన్16(జనంసాక్షి ):** రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉచ్చులు,కరెంటు తీగలు గాని,పెడితే వారిపై అటవీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని గూడూరు ఎఫ్ఆర్ఓ ప్రసాద్ రావు హెచ్చరించారు.ఈసందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ గూడూరు బీటు కంపార్ట్మెంట్ నెంబర్ 1005 పాటిమీది గుంపు గ్రామ సమీపంలో గల గండి చెరువు ప్రాంతంలో అజ్ఞాత వ్యక్తి అమర్చిన ఉచ్చులలో మచ్చర్ల గ్రామానికి చెందిన గేదె 2రోజుల క్రితమే పడిపోయి చనిపోయి ఉంటుందని,ఆ పరిసర ప్రాంతంలో ఉచ్చులు అమర్చి ఉన్నాయేమోనని వెతకగా మాకు ఏమీ కనిపించలేదని తెలిపారు.ఎవరైన రిజర్వ్ ఫారెస్ట్ లో ఉచ్చులు గాని,కరెంటు తీగలుగాని పెట్టవద్దని, అటవీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని,ప్రజా ప్రతినిధులు,ప్రజలు సహకరించి ఉచ్చులు పెట్టే వారి వివరాలు తెలియజేయాలని,వివరాలు అందించిన వారి పేర్లు గొప్పేంగా ఉంచుతామని తెలిపారు.

## అల్వాల బ్రదర్స్ ఆధ్వర్యంలో
# కాంగ్రెస్ నాయకుని జన్మదిన వేడుకలు



**బచ్చన్నపేట జూన్ 16( జనం సాక్షి):** బచ్చన్నపేట మండల కేంద్రంలో ఆల్వాల బ్రదర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆల్వాల రమేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి కేక్ కటింగ్ చేయించి శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో ఉన్నత శిఖరాలను అవరోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల స్వామి, అల్వాల పరుశరాములు, అల్వాల రాజు, అల్వాల మహేందర్, అల్వాల అనిల్ కుమార్, జయల రమేష్, మానపల్లి రాజు, అజయ్ కుమార్, ఆల్వాల పరశురాములు, విష్ణు, ప్రదీప్, అల్వాల మహేష్, అల్వాల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు పంపిణీ



**ఖానాపూర్ జూన్ 16 (జనం సాక్షి)** ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణ అధ్యక్షుడు గౌర్రె గంగాధర్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అరటిపండ్ల తో పాటు బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జు పటేల్ మరెన్నో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జంగిలి శంకర్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, కౌన్సిలర్ లు రాజురా సత్యం, నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ధోనికేని దయానంద్, సర్పంచ్ ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు రాజు నాయక్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతానికి బీఎల్ఓల పాత్ర కీలకం

### - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ అధికారుల పాత్ర (బీఎల్ఓలు) కీలకం అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో లిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు, బీఎల్ఓలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్లి మాట్లాడుతూ.... జూన్ 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ౡ×= – ౘజూవఝుఖ్రీ ×త్వఅంఱజవ =వజఱంఱశీఅ) ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. మరణించిన వారిని, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని, డూప్లికేట్ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాలని కలెక్టర్సూ చించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన డిక్లరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేసి, వాటి స్వీకరణకు సంబంధించిన అంగీకార పత్రాన్ని (అక్నాలెడ్జ్మెంట్) తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు తప్పకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని లికలెక్టర్లి ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (దీూం) ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటర్ల వివరాలను సేకరిస్తారన్నారు. సేకరించిన సమాచారం ఆధారంగా జూలై 31న ముసాయిదా (ఐత్ఖీఢ్) ఓటర్ల జాబితాను అధికారులు ప్రదర్శిస్తారన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, పేర్ల తొలగింపు (లేదా) సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అక్టోబర్ 1, 2026 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు.డివిజన్, ఏఈఆర్ఓ స్థాయిలలో కూడా శిక్షణ తరగతులు నిర్వహించాలని, ఎస్ఐఆర్‌లో ఉన్న అన్ని మాడ్యూల్స్ పై బీఎల్ఓలు అవగాహన కలిగి ఉండాలన్నారు. చాలా జాగ్రత్తగా ఎక్కడ కూడా తప్పు జరగకుండా ఈ ప్రక్రియను చేపట్టాలని, ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అంతకుముందు లిమాస్టర్ ట్రైనర్లు (రఘునాథపల్లి, చిల్పూర్ తహసీల్దార్లు)లి ఎన్యూమరేషన్ ప్రక్రియలోని దశలు, బీఎల్ఓ యాప్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియపై గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన మెటీరియల్ బ్యాగులను ఏఈఆర్ఓలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవోలు గోపిరాం, కిరణ్ ప్రకాష్, అన్ని మండలాల తహసీల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- ఈనెల 20న రెండవ జాతీయ మేగా లోక్ అదాలత్




**వరంగల్ బ్యూరో, జూన్ 16 (జనం సాక్షి)** ఈ నెల 20వ తేదీ శనివారం జరిగే రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ జాతీయ మెగా లోక్ ఆదాలత్ సంబందించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 20తేది శనివారం రోజున రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజనకేసులు,కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు,బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని తెలిపినారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్స్ స్పెక్టర్ క్రాంతికుమార్, దామెర ఎస్.ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కుల పంపిణీ...



**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులను పాపయ్యపేట గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండా కృష్ణమూర్తిలు పంపిణీ చేశారు. మంగళవారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠ్యాంశ బోధన సాగుతున్నదని, ఖాన్ అకాడమీ లాంటి సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని అధునాతన రీతిలో ఏఐ టెక్నాలజీ సాయంతో పాఠ్యాంశాల బోధన సాగుతున్నదన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఉచితంగా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, హరి, మధుబాబు, షాహిద్, సిఆర్పి బాలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# చందాలేసుకోని రోడ్ల మరమ్మతులు చేపడతాం

- గ్రామాలపై కక్షకట్టి బీటీ రోడ్లను రద్దు చేసిన ఎమ్మెల్యే
- గ్రామాల్లో మళ్లీ రౌడీయిజం రాజ్యమేలుతుంది
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నల్లబెల్లి, జూన్ 16 (జనంసాక్షి):** మండలంలోని మేడపల్లి-రాంపూర్ ప్రధాన రహదారి మరమత్తు పనులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చందాలేసుకొని కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేలా మరమ్మత్తులు చేపడతామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మేడిపల్లి, రాంపూర్, గొల్లపల్లె, ఆసరెల్లి, కొండాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని మేడపల్లి క్రాస్ రోడ్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ది ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలిచిన గ్రామాలపై స్థానిక ఎమ్మెల్యే కక్షకట్టి బీటి రోడ్లను రద్దు చేశాడని ఆరోపించారు. 30 ఏళ్ల క్రితం అంతమైన రౌడీయిజం మళ్లీ గ్రామాలలో రాజ్యమేలుతుందని తెలిపారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరింపులకు గురి చేస్తూ బిల్లులు రాకుండా ఎమ్మెల్యే మాధవరెడ్డి అడ్డుపడుతున్నాడనీ ఆరోపించారు. నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఎండాకాలంలో కూడా అలుగు పడేలా గోదావరి జలాలు తీసుకొచ్చి రైతుల పాదాలు కడిగానని చెప్పారు. కానీ ఎమ్మెల్యే కుట్రపూరితంగా చెరువులు నింపకుండా అక్రమ పర్మిషన్లతో మట్టి దందా, మొరం దందా చేస్తూ కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా మొద్దు నిద్ర వీడి రోడ్లను బాగు చేయాలని లేనియెడల కాంగ్రెస్ పార్టీకి బుద్ధి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లు, మండల పార్టీ అధ్యక్షులు, ఖనిజ అభివృద్ధి సంస్థ డైరెక్టర్, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి 10 లక్షలు ప్రభుత్వం చెల్లించాలి

**మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్**



**పర్వతగిరి, జూన్ 16 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన ధోనికెలా శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం 10 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవషాత్తు కింద పడి చని పోవడం జరిగింది.మృతుడు శ్రీనివాస్ గౌడ్ పార్తీహ దేహాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్,కల్లెడ పిఎసియస్ చైర్మన్ మోటపోతుల మనోజ్,సందర్శించి పూలమాల నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ భార్య,కొడుకు,కూతురులను మండల నాయకులతోపాటు మోకుదెబ్బ రమేష్ గౌడ్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐలపాక స్వరూప రవీందర్, మండల బీసీ సెల్ నాయకులు ఆడేపు కుమారస్వామి, సొసైటీ మాజీ డైరెక్టర్ మోహన్ నాయక్, పర్వతగిరి మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్ నర్సంపేట మోకుదెబ్బ మండల సోషల్ మీడియా ఇంచార్జీ మర్ద సతీష్ గౌడ్,దౌలత్ నగర్ గౌడ సంఘం సర్పంచ్ పుల్లూరి సారయ్య గౌడ్,తీగల వీరాస్వామి గౌడ్,ధోనికెలా సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హరిజనవాడలో నూతన బోరుకు శ్రీకారం

**కడెం:జూన్16(జనం సాక్షి) :** కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామపంచాయతీ పరిధిలోని హరిజనవాడ గ్రామంలో అవసరమైన నీటి సౌకర్యం కల్పించేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం రోజున నూతన బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఈదుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అభివృద్ధికి ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ అందిస్తున్న సహకారానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడగల భూషణ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్,ఉప సర్పంచ్ తక్కల్లా రమ్య రవీందర్ తో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇన్స్ట్రక్టర్,ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యాధికారి ప్రభాకర్**



**రేగొండ,జూన్16( జనం సాక్షి):** మండలంలో కొత్తగా మంజూరైన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో బోధనను నిర్వహించుటకు ఖాళీగా ఉన్న 2 ఇన్స్ట్రక్టర్, 2 ఆయా పోస్టులకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు మండల విద్యాశాఖ అధికారి వేల్పుల ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 10 నెలల తాత్కా లిక ప్రతిపాదికన లింగాల, భాగిర్తిపేట పాఠశాలలో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 19 సాయంత్రం 4 గంటల వరకు మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో దరఖాస్తు ఫారంతో పాటు స్థానికత, విద్యార్హత ధృవపత్రాల నకలు, పాస్ ఫొటోను జత పరచి అందజేయాలన్నారు. ఇన్స్ట్రక్టర్కు నెలకు రూ.8000 గౌరవ వేతనం ఉంటుందని ఈ పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలని, ప్రీ ప్రైమరీ డిప్లమా లేదా ప్రీ ప్రైమరీ ట్రైనింగ్ చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయాకు రూ.6000 గౌరవ వేతనం ఉంటుంది.

## ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



**మహబూబాబాద్, జూన్ 16(జనం సాక్షి):** మహబూబాబాద్ అమరవీరుల స్థూపం వద్ద మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ, తెలంగాణకై తెగించి పోరాడిన వారందరికీ న్యాయం జరగాలని, ఈ మధ్య ఉద్యమకారుల పేరిట చాలా సంఘాలు వస్తునందున ఉద్యమకారులు ఎటు ఉండాలో తెల్చుకోలేకపోతున్నారని కావున గతంలో ఎవరి ఆధ్వర్యంలో పని చేశారో వారితో ఉండడమే మంచిదని, తెలంగాణకై కష్టపడి, నష్టపోయిన తెలంగాణ ఉద్యమకారులను నిష్పక్షపాతంగా గుర్తించి, సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులు అహ్మద్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమ నాయకులు దార్ల శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమంలో పాల్గొన్నందుకు విద్యార్థి ఉద్యమకారుల భవిష్యత్తు అంతా నాశనం అయ్యిందని, ఏ పార్టీలో లేని విద్యార్థి ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వమే గుర్తించి సాయం చేయాలి. విద్యార్థి దశలో మేం కోల్పోయిన భవిష్యత్తును పొందలేమని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని కమిటీల పేరిట కాలయాపన చేయకుండా, తక్షణమే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు, గౌరవ ప్రదమైన స్థాయిలో పెన్షన్ మంజూరు చేసి ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అహ్మద్ ఖాన్, పుచ్చకాయల రామక్రిష్ణ, దార్ల శివరాజ్, దేవోజి నాయక్, బొర్రాజు లింగన్న, ఖయ్యాం, చెక్కల అశోక్, పుచ్చబాలకృష్ణ , షేఖ్ సాదిఖ్, నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ




**స్టేషన్ ఘన్పూర్ , జూన్ 16 ( జనం సాక్షి) :** చిల్పూర్ మండల కేం ద్రం లోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో మంగళవారం పురస్కరించుకొని శ్రీ స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన పూజ బంగారు పద్మా లతో అంగరంగ వైభవంగా అర్చకులు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ శ్రీ పొట్లపల్లి శ్రీధర్ రావు,కిరణ్మయి 516 రూపాయలు చెల్లించి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధగ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఈ కార్యక్రమం కార్యనిర్వాహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కే మోహన్, ధర్మకర్తలమండలి సభ్యులు తదిత రులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి, వానాకాల సన్నాహకాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 16 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి అభివృద్ధి కార్యక్రమాలు, వానాకాల సన్నాహకాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ వానాకాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని, నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, కాలువలు, మిషన్ కాకతీయ పనులను వేగవంతం చేసి చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు వాతావరణ సమాచారం, సాగు సలహాలను ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా చేరవేయాలని, రైతు వేదికల ద్వారా పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, కొత్త మెడికల్ కాలేజీ నిర్మాణం, ఓపీ విభాగాల పనితీరును సమీక్షిస్తూ ఆసుపత్రుల్లో కొత్త వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డాక్టర్ల హాజరు, మందుల లభ్యత, డయాలసిస్ యంత్రాల ఏర్పాటు, ఖాళీ పోస్టుల భర్తీ, పరిశు భ్రత నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు బీమా, సన్నవడ్లకు బోనస్, ఆరు గ్యారంటీల వంటి సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, జిల్లా ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి వేగవంతమైన, మర్యాదపూర్వక వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షిస్తూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బుధవారం మండల స్థాయి సమావేశాల్లో పాల్గొని అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. జూన్ 18 నుంచి ప్రారంభమయ్యే వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ముంపు ప్రాంతాలు, ప్రమాదకర భవనాలు, వర్ష ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. అనంతరం జిల్లా ప్రధాన ఆసుపత్రి అభివృద్ధిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించి, మందులు, సర్జికల్ సామాగ్రి, అత్యవసర అవసరాల కోసం అదనపు నిధులపై నాలుగు తీర్మానాలను సభ ఆమోదించింది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పురుషోత్తం వివరాలు సమర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కేవలం ప్రకాష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి ,జూన్ 16 (జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య లతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ



నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదిగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, అదే రోజున జిల్లాలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2026 వనమహోత్సవం లో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంలో సంబంధిత అధికారులకు అటవీ అధికారులు సహాయం అందిస్తారని, మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరువైపుల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనుల దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అటవీ భూముల తగాదాలు ఉన్నచోట వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం తీసుకోవాలి

**● అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్..**

**మహబూబాబాద్, జూన్ 15 (జనం సాక్షి):** మానవతా సేవే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచనల మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా జిల్లా జర్నలిస్టులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలకు ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. సభ్యత్వం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభించడంతో పాటు అత్యవసర పరిస్థితులు, ప్రకృతి విపత్తులు, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలకు సహకరించే అవకాశముంటుందని పేర్కొన్నారు. సేవా భావం కలిగిన యువత, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు మరియు సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకొని సమాజానికి తమ వంతు సేవ అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొని సభ్యత్వ నమోదు చేసుకున్నారు.



## సొంత డబ్బులతో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

**చెన్నారావుపేట, జూన్ 16 ( జనం సాక్షి):** నిరుపేద వృద్ధ మహిళకు చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి దంపతులు అండగా నిలిచారు.సేవా భావంతో, నిరుపేద వృద్ధ మహిళ గండికోట ఎల్లమ్మకు నూతనంగా ఇల్లు నిర్మించి ఇస్తామని మాట ఇచ్చిన గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి దంపతులు ఆ మాటను నిలబెట్టుకుంటూ మంగళవారం సొంత డబ్బులతో నూతన ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోయించారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేసి, ఎల్లమ్మకు సొంత ఇంటి కలను సాకారం చేయనున్నట్లు తెలిపారు. నూతన ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోసి పనులు చేపడుతుండటంతో నిరుపేద వృద్ధ మహిళ గండికోట ఎల్లమ్మ సర్పంచ్ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

## టాపర్లకు నగదు ప్రోత్సాహం

**ఆత్మకూర్, జూన్ 16 (జనం సాక్షి):** ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తేనే మరిన్ని విజయాలు సాధ్యమవుతాయని చాటుతూ హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాలలో పదో తరగతి టాపర్లకు నగదు బహుమతులు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు.రేమిడి శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపింది. 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ అనిత శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాత రేమిడి మల్లారెడ్డి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.5,000, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.3,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమానికి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నిర్మలకుమారి హాజరయ్యారు.

# రెబ్బెన రైల్వే,రెవెన్యూ భూ వివాదంపై ఎంపీ గోడెం నగేష్‌కు అఖిలపక్ష వినతి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి):** అదిలాబాద్ పట్టణంలో రైల్వే,రెవెన్యూ భూ వివాదంపై అఖిలపక్ష కమిటీ నాయకులు, రైల్వే భూ బాధితులు కలిసి ఎంపీ గోడెం నగేష్ కి వినతి పత్రం అందజేశారు. బీజేపీ ఆసిఫాబాద్ జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రెబ్బెన సర్పంచ్ దుర్గం భరద్వాజ్ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. రెబ్బెనలో గత 60 ఏళ్లుగా రెవెన్యూ భూమిలో చిన్నచిన్న షాపులు, హోటళ్లు నిర్వహిస్తూ దాదాపు 250 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, సుమారు 1000 మందికి పరోక్షంగా ఆధారం ఉందని వారు వివరించారు. 2007లో నిర్వహించిన జాయింట్ సర్వేలో రైల్వేకు 38.04 ఎకరాలు ఉన్నప్పటికీ, వాస్తవానికి 45.30 ఎకరాలు రైల్వే ఆధీనంలో ఉన్నట్లు, అందులో 7.26 ఎకరాలు ప్రభుత్వ మిగులు భూమిగా గుర్తించబడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ మిగులు భూమిలో గత



దశాబ్దాలుగా నివసిస్తూ వ్యాపారం చేస్తున్న వారికి క్రమబద్ధీకరణ చేయాలని వారు ఎంపీని కోరారు. ఎంపీ గోడెం నగేష్ సమస్యను పరిశీలించి అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్పందించిన ఎంపీకి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల గంగాపూర్ గేట్ ఎల్ సి -71 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కూడా రెబ్బెన మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు...**

**దుగ్గొండి, జూన్ 16 (జనంసాక్షి):** ఆరుగాలం కష్టపడి పనిచేస్తున్న అన్నదాతకు ఒకవైపు గిట్టుబాటు ధర లేకుండా అల్లాడుతుంటే కేంద్ర ప్రభుత్వం మోళ్లే నక్కపై తాటి పడు పడిన చందంగా ఎరువుల ధరలు పెంచి రైతన్న నడ్డి విరుస్తుందని తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు అన్నారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం దుగ్గొండి మండలం మూడో మహాసభ నాచినపల్లి గ్రామంలో జరిగినది. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా చల్ల నరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభలకు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ భారత దేశంలో నిర్మాణాత్మకంగా ఉన్న ఏకైక సంఘం తెలంగాణ రైతు సంఘం అని అన్నారు. దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుక పోయిందన్నారు కేంద్రం ఎరువుల ధరలు పెంచి రైతులను దగా చేస్తుందన్నారు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాకా రైతులు తీవ్ర నష్టాలలో కూరుకపోయారని అన్నారు రైతులకు రైతు భరోసాని సక్రమంగా ఇవ్వక పంట రుణాలను



సక్రమంగా మాపి చేయకపోవడం వలన రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రైతు భరోసాను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో రైతులను సమీకరించి రైతు సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని చల్ల నరసింహారెడ్డి, అక్కపెల్లి సుధాకర్ లను అధ్యక్ష కార్యదర్శులుగా, పి మహేందర్ రెడ్డి, కొంగర నర్సింహ్మ స్వామి, బొళ్ళ రమేశ్, బత్తిని గణేశ్, బీరం శ్రీనివాస్ రెడ్డి, శివరాత్రి సాంబయ్య, కోడం రమేష్, కొనకటి భాస్కర్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## ములుగు డివిజన్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనం ప్రారంభం

**ములుగు ప్రతినిధి, జూన్ 16(జనంసాక్షి) :** విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో మంజూరైన ఇసుజు డి-మ్యాక్స్ ఎస్-క్యాబ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ) వాహనాన్ని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి భిక్షపతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలు, బ్రేక్‌డౌన్ పరిస్థితులు, నిర్వహణ పనులు, దెబ్బతిన్న డీటీఆర్‌ల తరలింపు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అత్యవసర సేవలను మరింత వేగంగా అందించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి నాగేశ్వరరావు డివిజనల్ ఇంజనీర్, ఎన్ వేణుగోపాల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, మహేందర్ ఏఈ కమర్షియల్, కృష్ణారావు ఏఈ టెక్నికల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**తొర్రూరు ,జూన్ 16 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల పరిధిలోని పత్తేపురం గ్రామంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది వేగంగా వచ్చిన లారీ, ద్విచక్ర వాహనం ఒకదానికొకటి ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన కోనేటి వెంకటయ్య తన బైక్‌పై తొర్రూర్ వైపు వెళ్తున్నారు ఆయన పత్తేపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఒక లారీ వెంకటయ్య బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటయ్య తలకు తీవ్రమైన గాయాలయ్యాయి ప్రమాద స్థలంలో పెద్ద ఎత్తున రక్తస్రావం కావడంతో ఆయన అక్కడికక్కడే స్పృహ కోల్పోయి పడిపోయారు దీనిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు.